క్లుప్తంగా

పెనుగొలనులో కవుల చిత్రపటాల ప్రదర్శన



పెనుగొలను(గంపలగూడెం): తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రముఖ కవుల చిత్రపటాలను ప్రదర్శించారు. తొలుత గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కవుల చిత్రపటాలు చేబూని గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఎలిమెంటరీ పాఠశాల హెచ్ఎం నరసింహారావు, ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ వి. వెంకటరెడ్డి, గ్రంథాలయ అధికారి జె. శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని కృపావతికి అవార్డు ప్రదానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పట్టణానికి చెందిన ఉపాధ్యాయిని చిరువెళ్ల కృపావతికి అరుదైన గౌరవం దక్కింది. అనాథ పిల్లలకు అందిస్తున్న సేవలకు గాను మదర్ థెరిస్సా జాతీయ అవార్డు 2024 ఆమెకు దక్కింది. మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ హనుమంతరావు గ్రంథాలయంలో బుధవారం జరిగిన మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా అవార్డును ఆమెకు అందజేసి శాలువాతో సత్కరించారు. గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందజేయగా ఈ ఏడాది మదర్ థెరిస్సా జాతీయ అవార్డు దక్కడం ఆనందంగా ఉందని ఆమె తెలిపింది. సొసైటీ ఫౌండర్ మల్లాది ప్రసాదరావు పాల్గొన్నారు.

10 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు బుధవారం జరిగాయి. జితార కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి ప్రతిభ చూపిన పది మందికి నియామక పత్రాలు అందజేశారు. ఎంపికైన విద్యార్థులు శాస్త్రసాంకేతిక రంగంలో అత్యుత్తమ ప్రతిభ చాటుతారనే నమ్మకాన్ని ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య వ్యక్తం చేశారు. జితార కంపెనీతో అనుబంధం పెంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎంపికైన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ సాయిరామ్, ప్లేస్‌మెంట్ అధికారులు, నరేంద్ర, సంతోష్ కుమార్ అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో పుల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ గార్లపాటి రమేష్ తెలిపారు. పుల్లూరు, దాసుళ్లపాలెం, బాడవ, కొత్తగూడెం, మంగాపురం, చిలుకూరువారిగూడెం, మొరుసుమల్లి, ములకలపెంట, సీతారామపురం తండా గ్రామాలకు గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

- చాట్రాయి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని సోమవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్త లైన్ నిర్మాణ పనుల నిమిత్తం యర్రవారిగూడెం, కొత్తగూడెం, మర్లపాలెం, సోమవరం గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



ముసునూరు: మూడు గ్రామ సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, జ్వరాల సర్వే నిర్వహిస్తున్నామని ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షకీనా ఇవాంజిలిన్ తెలిపారు. జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని పీహెచ్‌సీ పరిధిలోని ముసునూరు, గోపవరం, చింతలవల్లిలో బుధవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వరాల సర్వేలు చేశామని చెప్పారు. ఈ శిబిరాల్లో 108 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి సాధారణ జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి డెంగీ, మలేరియా పరీక్షలు చేయగా నెగెటివ్ వచ్చాయని, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులకు మందులు అందజేశామన్నారు. గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. సాయంత్రం దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. వైద్య శిబిరాలను కొద్దిరోజులు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

సమాజంలో మార్పు రావాలి



సమాజంలో మార్పు తీసుకువస్తేనే కోల్‌కతా వంటి ఘటనలు ఆగుతాయి. యువతలో నైతిక విలువలు కొరవడ్డాయి. సోషల్ మీడియా, డ్రగ్స్ వంటివి తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. సమాజంలో పడిపోతున్న విలువలను పైకి తీసుకురావాలి. అప్పుడే డాక్టర్లకైనా, ఆడపిల్లలకైనా రక్షణ ఉంటుంది. నిందితులను కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ మామిడి సీతారామారావు, సర్జన్, మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ కొండపల్లి



కఠిన చట్టాలు ఉండాలి



ప్రాణాలు పోసే వైద్యులకు రక్షణ లేకుండా పోయింది. వైద్యులపై దాడి చేస్తే కఠిన శిక్షలు పడేలా చట్టాలు ఉండాలి. పీహెచ్‌సీల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బందికి రక్షణ కల్పించాలి. ఇటీవల కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటన అమానుషం. ఈ కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి. వైద్యులలో ఆత్మస్థైర్యం నింపేలా చట్టాలు రూపొందించాలి. పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ జగన్‌మోహన్‌రావు, ఆగిరిపల్లి పీహెచ్‌సీ

శిథిలావస్థలో సరస్వతీ నిలయాలు



శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనంలో వంట చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు



పెచ్చులూడుతున్న పాఠశాల భవనం పైకప్పు

- పెచ్చులూడి పడుతున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనం
- నూతన భవనం ఉన్నా.. తరగతి గదులు చాలక ఇబ్బందులు
- పాత భవనంలోనే ఏజెన్సీ నిర్వాహకుల వంటల తయారీ

మైలవరం: మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం లోపల శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. స్తంభాలు పగిలిపోయి ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. ఈ పాఠశాలలో ప్రస్తుతం 634 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. పాఠశాలకు దాతల సహకారంతో నూతన భవనం ఏర్పాటు చేశారు. అయితే ఆ భవనంలో గదులు చాలకపోవడంతో అటు విద్యార్థినులు, ఉపాధ్యాయినులు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

జూనియర్ కళాశాలగా అభివృద్ధి

ఈ పాఠశాల స్థాయిని పెంచి జూనియర్ కళాశాలగా అభివృద్ధి చేశారు. గతంలో బాలికలు కూడా స్థానికంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలురతో కలిసి ఇంటర్ మీడియెట్ చదువుకునే వారు. ఈ నేపథ్యంలో విద్యార్థినుల కోసం బాలికల హైస్కూల్‌లో బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. జూనియర్ కళాశాలలో 72 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. హైస్కూల్‌కు, జూనియర్ కళాశాలకు తరగతి గదులు చాలక ఇబ్బందులు పడుతున్నారు.

పాత భవనంలోనే వంటల తయారీ

ఇదిలా ఉండగా కొత్త బిల్డింగ్‌లో మధ్యాహ్న భోజన పథకం కోసం వంటలు చేయడానికి ప్రత్యేక గది లేకపోవడంతో పాత భవనంలోనే వంటలు చేస్తున్నారు. భవనం ఎప్పుడు కూలుతుందో తెలియక వంట ఏజెన్సీ నిర్వాహకులు దినదినగండంలా పనులు చేసుకుంటున్నారు. ప్రతి నిత్యం స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, ఇతర వాహనాలు తిరుగుతుంటాయి. అంతేగాక సమీపంలో నివసించే కుటుంబాలు కూడా ఎప్పుడు ఈ భవనం కూలుతుందోనని, ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. విద్యాశాఖాధికారులు స్పందించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగక ముందే శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వసతిగృహాలదీ అదే స్థితి

తిరువూరు: పేద విద్యార్థుల కోసం గతంలో నిర్మించిన సంక్షేమ వసతి గృహాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. తిరువూరు పట్టణంలోని రాజుపేట తోకపల్లి రోడ్డులో 25 ఏళ్ల కిందట నిర్మించిన సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహ భవనం పూర్తిగా శిథిలమవడంతో విద్యార్థినులను ప్రైవేటు భవనంలోకి తరలించారు. అద్దె భవనంలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండటంతో శిథిలమైన భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నా అధికారులు స్పందించడం లేదు. బాలికల వసతిగృహ భవనం నిర్మాణానికి గతంలో రూ.60 లక్షలు మంజూరైనట్లు పలుమార్లు అధికారులు చెప్పినా పనులు మాత్రం చేపట్టలేదు.

చిట్టడవిగా బాలికల వసతిగృహ భవనం ఆవరణ

తోకపల్లి రోడ్డులోని బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. భవన ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్లతో చిట్టడవిని తలపిస్తోంది. చుట్టుపక్కల నివాస గృహాల్లోకి పాములు, విషసర్పాలు వస్తుండటంతో వసతి గృహ భవన ఆవరణను శుభ్రపరచాలని, నూతన భవన నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్షం నీరు గదుల్లోకే..

తిరువూరు పాతూరులో డిగ్రీ కళాశాల సమీపంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలుర వసతి గృహ భవనం కూడా పూర్తిగా శిథిలమైంది. పైకప్పు పాడైపోయి వర్షం నీళ్లు గదుల్లోకి చేరుతున్నాయి. గోడలు కూలే స్థితికి చేరుకున్నాయి. పట్టణానికి దూరంగా ఉన్న బీసీ బాలుర వసతిగృహ ఆవరణలో విషసర్పాలు సంచరిస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఈ వసతిగృహాన్ని అద్దె భవనంలోకి తరలించాలని అధికారులు ప్రతిపాదించినప్పటికీ జిల్లా అధికారుల నుంచి అనుమతి రాలేదు.

స్టోర్ రూం ఏర్పాటు చేయాలి

పాత భవనంలోనే వంటలు చేస్తున్నాం. భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదు. మాకు కొత్త పాఠశాల ప్రాంగణంలో వంట గది, సామాను పెట్టుకునేందుకు స్టోర్ రూమ్ ఏర్పాటు చేయాలి.

-సునీత, మైలవరం



తిరువూరులో శిథిలావస్థలో బీసీ బాలుర వసతిగృహం



తిరువూరు సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహ భవనం ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు

నివేశన స్థలాల పరిశీలన



కొండపర్వ(విస్సన్నపేట): మండలంలోని కొండపర్వ గ్రామంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలో కేటాయించిన నివేశన స్థలాలను ఆర్డీఓ కె. మాధవి బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గతంలో కాలనీ ఇళ్లు మంజూరైన వారు 40 మంది ఉన్నారని, నివేశన స్థలాల వద్ద మౌలిక వసతులు కల్పిస్తే ఇళ్లు నిర్మించుకుంటారా అని లబ్ధిదారులను ప్రశ్నించారు. నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారికి కాలనీ ఇళ్లు మంజూరు చేయాలని లబ్ధిదారులు ఆర్డీఓను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి, ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ, డీటీ మోతియా పాల్గొన్నారు.

వసతిగృహం ప్రారంభం



విస్సన్నపేట: విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు, వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కేఎమ్మార్, ఎమ్మెస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ గిరిజన సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి బుధవారం రాత్రి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని, లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. సంబంధిత అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయి ఎస్ఐగా రామకృష్ణ

చాట్రాయి: చాట్రాయి ఎస్ఐగా డి. రామకృష్ణ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకు నూజివీడు టౌన్ ఎస్ఐగా పని చేశారు. ఇప్పటి వరకు చాట్రాయి ఎస్ఐగా పనిచేసిన స్వామి పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని చెప్పారు.

అట్రాసిటీ కేసులకు త్వరితగతిన పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ భవానీశంకరి

ఆర్డీఓ వై.భవానీశంకరి

నూజివీడు: డివిజన్‌లో ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను, అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ వై.భవానీశంకరి అన్నారు. ఎస్సీ, ఎస్టీ నూజివీడు డివిజన్ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారం, కేసుల స్టేటస్‌పై సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ పిల్లలు చదువుకుంటున్న వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కమిటీ సభ్యులు నత్తా నాగేశ్వరరావు మాట్లాడుతూ బెస్ట్ ఎవైలబుల్ స్కూళ్లకు ప్రభుత్వం గతంలో మంజూరు చేసిన నిధుల విషయంలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. నెహ్రూపేటకు వెళ్లే రోడ్డులో బస్టాండ్ వద్ద డ్రెయినేజీలను ఆక్రమించి హోటళ్లు, కిళ్లీ షాపులు ఏర్పాటు చేశారని, దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఆ అక్రమణలను తొలగించాలని ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులతో మూడు నెలలకొకసారి సమావేశాలు నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్లలో ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసేటప్పుడు కేసుల వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. వీటన్నింటికీ ఆర్డీఓ సానుకూలంగా స్పందించారు. సమావేశంలో నూజివీడు పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్‌మూర్తి, ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీనివాసరావు, సభ్యులు నత్తా నాగేశ్వరరావు, ఉదయగిరి కృపారావు, అయ్యంకి సురేష్‌బాబు, జగన్నాథం వాకిలయ్య, డివిజన్‌లోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యుత్ ధరలపై సీపీఎం నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

మైలవరం: విద్యుత్ ఉద్యమ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ ధరలపై మరోసారి ఉద్యమిద్దామని సీపీఎం మైలవరం నాయకులు రావూరి రమేష్‌బాబు, సీహెచ్ సుధాకర్ పిలుపునిచ్చారు. మైలవరం సీపీఎం కార్యాలయంలో విద్యుత్ ఉద్యమంలో అమరులైన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు నాయకులు బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ పేదల అభివృద్ధిని మరిచి పెట్టుబడిదారులకు పాలకులు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. దీనితో పేద, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతోందన్నారు. ప్రధానమైన ఆహార పదార్థాలపై ధరలు రోజురోజుకు పైపైకి వెళుతున్నాయని చెప్పారు. ఫలితంగా నెలసరి ఆదాయంలో మూడు వంతులకు పైగా కుటుంబం ఆహార అవసరాలకే సరిపోతున్నాయని, విద్య, ఆరోగ్యం వంటి అవసరాలకు అవస్థలు పడాల్సివస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి విధానాలకు వ్యతిరేకంగా విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో సీపీఎం మరిన్ని ఉద్యమాలకు సిద్ధమవుతోందని, ప్రజలు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు సందిపాము ఇస్సాక్, రావుల సుబ్బారావు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు చెన్నారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ



వెంకట నర్సారెడ్డి (ఫైల్)

గోసవీడు(గంపలగూడెం): గోసవీడుకు చెందిన గోగిరెడ్డి వెంకట నరసారెడ్డి (74) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆయన పెద్దకుమారుడు, న్యాయవాది గోగిరెడ్డి కృష్ణారెడ్డి, కుటుంబీకులు ఆయన నేత్రాలను తెలంగాణ రాష్ట్రం ఖమ్మం నేత్రనిధికి దానం చేశారు. నేత్రనిధి వైద్యులు వచ్చి మృతదేహం నుంచి కార్నియాలు సేకరించి తీసుకువెళ్లారు.

ప్రజల ప్రాణాలు పోతున్నా చోద్యం చూస్తున్న పాలకులు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



మైలవరంలో పాదయాత్ర చేస్తున్న సీపీఐ నాయకులు

మైలవరం: ప్రజల ప్రాణాలు పోతున్నా పాలకులు చోద్యం చూస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఎ. కొండూరు డయాలసిస్ సెంటర్ నుంచి విజయవాడ లెనిన్ సెంటర్ వరకు సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్ర బుధవారం మైలవరం చేరుకుంది. మైలవరం పంచాయతీ కార్యాలయం కూడలిలో జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గాన్ని సిలికాన్ ఫ్లోరైడ్ రహిత నియోజకవర్గంగా మార్చాలని, కొండపల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాలలో పారిశ్రామిక కాలుష్యాన్ని నియంత్రించాలని, క్యాబినెట్ సమావేశంలో కృష్ణా జలాల పంపిణీకి చర్యలు చేపట్టాలని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ కిడ్నీ బాధితులకు న్యాయం చేయకుంటే అసెంబ్లీ ముట్టడికైనా సిద్ధమని హెచ్చరించారు. తిరువూరు నియోజకవర్గానికి కృష్ణా జలాలు సరఫరా చేయాలని, తిరువూరు, ఎ.కొండూరు డయాలసిస్ కేంద్రాల్లో అర్హత కలిగిన డాక్టర్లను నియమించాలని, అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, చుండూరు వెంకట సుబ్బారావు, తాడి పైడయ్య, కె. రమణారావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, షేక్ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే పారిశ్రామిక కాలుష్యం..

ఇబ్రహీంపట్నం: అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో వెలువడుతున్న పారిశ్రామిక కాలుష్యం ప్రజల ప్రాణాలు హరిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. తిరువూరు నుంచి ప్రారంభించిన ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్ర బుధవారం ఇబ్రహీంపట్నం చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్యం పాడెక్కుతున్నా పాలకులకు పట్టడం లేదని విమర్శించారు. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వానికి శ్రద్ధలేదన్నారు. ప్రజల ఆరోగ్యంపై చర్యలు తీసుకోకపోతే అసెంబ్లీని ముట్టడించేందుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్, నాయకులు రాజేంద్రబాబు, జి. కోటేశ్వరరావు, సీహెచ్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

వ్యవసాయాధికారి మధుమోహన్



ముసునూరు: వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు సూచించిన మోతాదులోనే పురుగు మందులు పిచికారీ చేసి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయాధికారి సందిపాము మధుమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని చెక్కపల్లిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మేలైన యాజమాన్య పద్ధతులను, సాగులో మెలకువలను తెలుసుకుని పంటల్లో అధిక దిగుబడి సాధించాలని సూచించారు. విచక్షణా రహితంగా పురుగు మందులు వాడకుండా సిఫారసు చేసిన మేరకు మాత్రమే వాడాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ అధ్యక్షుడు చిలుకూరి వెంకటేశ్వరరావు, ఏఈఓ రామకృష్ణ, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

మైలవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ సునీల్ అన్నారు. మైలవరం మండలంలోని పలు గ్రామాలను చంద్రాల పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్ బుధవారం సందర్శించి పంచాయతీ సిబ్బందితో దోమల మందు పిచికారీ చేయించారు. డ్రెయినేజీల్లో బ్లీచింగ్ చల్లించారు. మలాథియాన్ స్ప్రేయింగ్ చేయించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 16 ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సను అందించామన్నారు. ఇంటిలోను, బయట పాత్రలు, తొట్లు, ట్యాంకులు, టైర్లలో నీరు నిలువలేకుండా చూడాలని సూచించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. కొండపల్లికి చెందిన సాయి, ఇబ్రహీంపట్నానికి చెందిన బన్ను స్నేహితులు. వీరు బైక్‌పై కొండపల్లికి బయలుదేరారు. శ్రామికనగర్ వద్ద బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో బన్నుకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సాయికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను విజయవాడ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. గన్నవరం రోడ్డులోని వేంకటేశ్వర సినిమా థియేటర్ వద్ద చెత్త కుండీ లేకపోవడంతో స్థానికులు చెత్తను రోడ్డు మార్జిన్లలో వేస్తున్నారు. ఆ ప్రదేశం చెత్తతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. పందులు, దోమల స్వైరవిహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గ్రామంలో జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. సర్పంచ్, అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.